సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 25 । మార్చి । 2023



ఆరుదెంచిన మార్పు


వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. - వివరాలు 8లో▸



అన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆనందవేలు దంపతులు(రాజమహేంద్రవరం) రూ.20,232 శుక్రవారం విరాళంగా అందజేశారు.

డెల్టాలకు 6,250 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 6,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,850, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.75 అడుగులుగా ఉంది.



న్యూస్‌రీల్

పన్ను కట్టకపోతే కుళాయి, విద్యుత్ కనెక్షన్లు కట్

మున్సిపల్ రెవెన్యూ అధికారి శివాజీ



బకాయిలను చెల్లించని ఇంటి కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న రెవెన్యూ అధికారి శివాజీ బృందం

అమలాపురం టౌన్: మున్సిపాలిటీకి బకాయి ఉన్న ఇంటి పన్ను చెల్లించాలని పదే పదే కోరినప్పటికీ స్పందించని వారిపై చర్యలకు ఉపక్రమించినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి శిరిగినీడి శివాజీ తెలిపారు. తన ఆధ్వర్యంలో ఆర్ఐలు, వార్డు సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు ఓ బృందంగా పట్టణంలోని పన్నుల మొండి బకాయిదారుల ఇళ్లకు వెళ్లామని ఆయన చెప్పారు. పన్నులు చెల్లించడంలో అలక్ష్యం చేస్తున్న పలు ఇళ్లలో తాగునీటి కుళాయి, విద్యుత్ కనెక్షన్లను శుక్రవారం కట్ చేసినట్లు తెలిపారు. మిగిలిన పన్ను బకాయిదారులు సకాలంలో తమ సిబ్బందికి చెల్లించాలని సూచించారు. లేని పక్షంలో ఇళ్లకు ఉన్న కుళాయి, విద్యుత్ కనెక్షన్లను తొలగించే కార్యక్రమాన్ని కొనసాగించి చర్యలు తీసుకుంటామని శివాజీ హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ను ఉపయోగించుకుని వడ్డీ రాయితీని పొందాలని సూచించారు. పూర్తి వడ్డీ రద్దుతో అసలు పన్ను బకాయిని చెల్లించే వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రజలకు రెవెన్యూ అధికారి శివాజీ విజ్ఞప్తి చేశారు.

సమష్టి ప్రయత్నంతో వ్యాధి అంతం



క్షయ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లను అందిస్తున్న డాక్టర్ భారతలక్ష్మి తదితరులు

అమలాపురం టౌన్: సమష్టి ప్రయత్నంతో జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా అంతమొందిద్దామని జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారిణి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భారతలక్ష్మి పిలుపునిచ్చారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఆ రోగులతో శుక్రవారం ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ భారతలక్ష్మి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పీకే శ్రీనివాస్, సీఎం జగన్ ఫాలోవర్స్ ప్రతినిధి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ పీఎస్ శర్మ, స్నేహితా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు కుంచే స్వర్ణలత, టీబీ నియంత్రణ వైద్యురాలు డాక్టర్ శిరీష పాల్గొని టీబీ రోగులు ఈ వ్యాధి నుంచి వైద్యుల రాసి ఇచ్చే మందులు, న్యూట్రీషన్ ఫుడ్ తీసుకోవడం ద్వారా ఎలా తొందరగా బయటపడవచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం టీబీ రోగులకు న్యూట్రీషన్ ఫుడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ముక్త భారత్- నిక్షయ్ మిత్ర ద్వారా అందుతున్న మందులు, పౌష్టికాహారంతో తాము పొందుతున్న లబ్ధి, ఉప శమనం గురించి కొందరు రోగులు తమ అనుభవనాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్షయ వ్యాధిని పూర్తిగా అదుపు చేసేందుకు చేస్తున్న కృషి, సహాయ కార్యక్రమాలను డాక్టర్ భాతరలక్ష్మి వివరించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణ నుంచి క్షయ వ్యాధి అవగాహన ర్యాలీ ప్రారంభమైంది. క్షయ వ్యాధి నిర్మూలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలతో కూడిన ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: భారత వాయుసేనలో 2023 అగ్నివీర్ ఉద్యోగాలకు అర్హత గల అవివాహితులైన స్త్రీ పురుషుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారని కోనసీమ క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.సురేష్‌కుమార్ తెలిపారు. విద్యార్హతలు, వయసు, ఇతర వివరాలను భారతీయ వాయుసేన అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందాలన్నారు. ఆన్‌లైన్‌లో మార్చి 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

హామీకి కట్టుబడి ఆసరా

- మూడో విడత రుణమాఫీకి రంగం సిద్ధం
- జిల్లాలో 31,043 డ్వాక్రా సంఘాలకు రూ.253.76 కోట్ల లబ్ధి
- నేడు బటన్ నొక్కి ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వచ్చే నెల 5లోపు అన్ని గ్రూపుల ఖాతాలకు జమ



కొత్తపేట స్త్రీ శక్తి భవనంలో సమావేశమైన డ్వాక్రా మహిళలు (ఫైల్)

కొత్తపేట: పొదుపు మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రజాసంకల్ప పాదయాత్రలో అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా (డ్వాక్రా రుణమాఫీ) పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం మూడో విడత ఆసరా అమలుకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల 25న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఆసరా ఆర్థిక సాయాన్ని అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేయనున్నారు. వచ్చే నెల 5 లోపు అర్హత కలిగిన డ్వాక్రా గ్రూపులన్నింటికీ ఆయా ఖాతాల్లో రుణ మాఫీ సొమ్ము జమ కానుంది.

మాటకు కట్టుబడిన సీఎం జగన్

నాలుగేళ్ల క్రితం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు ముఖ్యంగా మహిళల కష్టాలు చూశారు. వారి కన్నీళ్లకు చలించారు. అప్పుడే నవరత్నాలు ప్రకటించారు. వాటిలో డ్వాక్రా రుణమాఫీ ఒకటి. 'డ్వాక్రా సంఘాల అక్క, చెల్లెమ్మలకు నేను అండగా ఉంటాను.. మీకున్న రుణాన్ని మాఫీ చేస్తాను.. మీ ఆర్థికాభివృద్ధికి ఆసరా కల్పిస్తాను.. అని జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 ఏప్రియల్ 11 నాటికి డ్వాక్రా సంఘాల పేరున ఎంత రుణం ఉంటే అంతా మాఫీ చేస్తూ నాలుగు విడతల్లో తిరిగి మీ ఖాతాలకే జమ చేస్తాను'. అని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన మాట నిలుపుకుంటున్నారు.

రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం ఈ పథకం అమలు చేయడం ద్వారా ఎందరో మహిళలకు ఆర్థిక ఇబ్బందులు తొలగనున్నాయి. దీంతో డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో 31,043 డ్వాక్రా సంఘాల మహిళలు రూ.253,76,50,988 మేర లబ్ధి పొందనున్నారు.

నియోజక వర్గం	డ్వాక్రా గ్రూపులు	లబ్ధి (రూ.లలో)
అమలాపురం	4,425	37,01,09,255
కొత్తపేట	6,297	54,77,35,379
పి.గన్నవరం	5,463	42,59,67,128
రాజోలు	3,945	33,79,05,344
ముమ్మిడివరం	3,502	24,58,53,195
మండపేట	4,563	37,52,72,826
రామచంద్రపురం	2,848	23,48,07,861

జగనన్న సీఎం కావడం మహిళలకు వరం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఈ రాష్ట్రంలో మా మహిళా లోకానికి ఓ వరం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అధికారం చేపట్టిన నాటి నుంచే అమలు చేస్తున్నారు. ముఖ్యంగా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. దానిలో భాగంగా డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో రద్దు చేస్తామని ఇచ్చిన మాట తూచా తప్పకుండా రెండేళ్ల వరుసగా అమలు చేశారు. ఈ ఏడాది నేడు మూడో విడత నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉంది.

– కుర్రా లక్ష్మి, డ్వాక్రా గ్రూపు సభ్యురాలు, కొత్తపేట

సంక్షేమ పథకాలు చారిత్రాత్మకం



భారతదేశ చరిత్రలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద, సామాన్య ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు చారిత్రాత్మకం. ప్రధానంగా మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం లక్ష్యంగా సంక్షేమ పథకాల రూపంలో ఆర్థిక సాయం అందిస్తున్నారు. తీసుకున్న డ్వాక్రా రుణం నాలుగు విడతల్లో తిరిగి ఇచ్చేందుకు ఉద్దేశించిన ఆసరా పథకం కింద ఇప్పటికే రెండు విడతలు ఇచ్చారు. ఈ రోజు మూడో విడత సొమ్ము జమ చేయనున్నారు. తద్వారా ఆ కుటుంబాలన్నింటికీ సీఎం జగన్ ఆసరాగా నిలిచారు.

– గూడపాటి రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు, కొత్తపేట

ఈ విధంగా రుణమాఫీ ఎప్పుడూ లేదు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు ఓ గొప్ప వరం. ఈ విధమైన రుణమాఫీ గతంలో ఎప్పుడూ జరగలేదు. మహిళలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని, రుణాలు చేయకూడదనే ఉద్దేశంతో ఈ విధమైన భరోసా కల్పించారు. డ్వాక్రా సంఘంలో మహిళలకు ఒక ధైర్యం, ధీమా కల్పించారు. ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇలాంటి పథకాలు మహిళలు స్వయంగా వృత్తి, వ్యాపారాలు చేసుకోవడానికి, బ్యాంకులు ఆలోచించకుండా రుణాలు కల్పించడానికి దోహదపడతాయి.

– పి.విశ్వనాథం, ఏపీఎం, కొత్తపేట

అసలైన మహిళా సాధికారత అంటే ఇదే



అసలైన మహిళా సాధికారత అంటే నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలతోనే.. అన్నింటా మహిళకు పెద్ద పీట వేస్తున్నారు. పాదయాత్రలో, ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్టుగా అమలు చేస్తున్నారు. వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, వైఎస్సార్ ఆసరా పేరుతో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– బండి తిరుమల, డ్వాక్రా సంఘ సభ్యురాలు, కొత్తపేట

భ్రూణహత్యలు నివారిద్దాం

కలెక్టర్ హిమాన్షు శుక్లా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: ఆడపిల్లల పట్ల వివక్షకు తావు లేకుండా జిల్లాలో భ్రూణహత్యలను సంపూర్ణంగా నివరించాలి. ఇందుకు పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్ఠ అమలు ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర అధ్యక్షతన శుక్రవారం జరిగిన జిల్లా సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొని సమీక్షించారు. గర్భస్థ పిండ ఆరోగ్య స్థితిగతుల పరిశీలన కోసం వినియోగించే వైద్య పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ కోసం దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్, డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధిత చట్టం ఫిర్యాదుల కోసం త్వరలో టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమలాపురంలోని రోహిణి సంతాన సాఫల్య కేంద్రం, కొత్తపేటలోని భాస్కర సంతాన సాఫల్య కేంద్రాలకు అనుమతులు ఇచ్చామని కలెక్టర్ పేర్కొన్నారు. ఏఎస్పీ కె.లతామాధురి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి జీవీ సత్యవాణి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై దృష్టి పెట్టాలి

10–19 సంవత్సరాల మధ్య ఉన్న బాల బాలికల్లో రక్తహీనత, పౌష్టికాహార లేమిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాలబాలికల్లో రక్తహీనత, పౌష్టికాహార లేమి తదితర అంశాలపై సమీక్షించారు. డీఈవో ఎం.కమలకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు కె.చంటిబాబు, సీహెచ్‌ఎస్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాక్షి 15వ వార్షికోత్సవ వేళ...



సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవం రాజానగరం యూనిట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సిబ్బంది పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ రీజనల్ మేనేజర్ ఎస్.రమేష్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. - రాజానగరం

ఒకటో నంబర్ ఆఫర్!

- వినియోగించుకోండి ఇలా....
- ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యాహక్కు
- 5 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం
- పేదలకు విద్యాహక్కు చట్టం కల్పించిన వెసులుబాటు

అమలాపురం టౌన్: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశంతో చేర్పే చట్టపరమైన వెసులుబాటు ఉంది. 2010లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1) సి ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 5 నుంచి 6 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం ఉంటుంది. ఇది ఇప్పటికే అమలులో ఉన్న వెసులుబాటు అయినప్పటికీ తల్లిదండ్రులు ఈ మార్గంలో ఏ నిబంధనలతో ఈ ఉచిత ప్రవేశాన్ని పొందాలనే దానిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో గల 343 ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఈ చట్టం ప్రకారం రిజర్వు అయి ఉన్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే ఏప్రిల్ 10వ తేదీ వరకూ అడ్మిషన్లు జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లాలోని 343 ప్రైవేటు పాఠశాలలు రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వ నిర్దేశించిన వెబ్‌సైట్ విండో ఓపెన్ చేసి ఉంచాయి. అర్హులైనవారు ఆ వైబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంది.

ఎవరు అర్హులు?

- ఒకటో తరగతి ఉచిత ప్రవేశం కోసం మాత్రమే ఈ వెసులుబాటు
- ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలు
- దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాలు
- ప్రభుత్వ పేదరిక నిర్మూలన కార్యక్రమాల లబ్ధిదారులు
- భూమిలేని వ్యవసాయ కూలీలు
- దివ్యాంగులు
- షెడ్యూల్డ్ కులాలు, తెగలు

ఉపయోగించుకోవడం ఎలా..

- ప్రవేశ దరఖాస్తుకు www.cse.ap.gov.in/RTE వెబ్‌సైట్‌ను సందర్శించాలి. లేదా సమీపంలోని వార్డు లేదా గ్రామ సచివాలయాల్లో ఉచితంగా దరఖాస్తులు పొందవచ్చు.
- అవసరమైన డాక్యుమెంట్స్ లేదా గ్రీవెన్స్‌లపై సమాచారం కోసం సమీప మండల విద్యాశాఖ కార్యాలయం లేదా గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని, ప్రైవేటు పాఠశాలను సంప్రదించాలి.
- ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబరు 14417 లేదా ఇండస్ యాక్షన్ హెల్ప్‌లైన్ నంబరు 9502666864కు కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలి.
- టోల్ ఫ్రీ నంబరులో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు మాట్లాడవచ్చు (సోమవారం నుంచి శనివారం వరకూ)

నెలాఖరులోగా వంతెన పనులు ప్రారంభించాలి



వంతెన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలునాయక్

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక గ్రామాల ప్రజల చిరకాల కోరిక అయిన వశిష్ఠ నదీపాయపై వంతెన నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.బాలు నాయక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన వంతెన నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. ఇటీవల వరద బాధితులను పరామర్శించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల కష్టాలు తెలుసుకుని, వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.49.5 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి అన్ని అనుమతులు మంజూరు చేశారు. ఈ ప్యాకేజీలో భాగంగా ఇటీవల పంట కాలువపై వంతెనకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బాలునాయక్ లంక గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణాన్ని పీపీ రాజు నేతృత్వంలోని ఏఈఈ అసోసియేటెడ్ ఇంజినీర్స్ ఎంటర్ ప్రైజస్‌కు అప్పగించినట్టు వెల్లడించారు. కాంట్రాక్టు సంస్థకు ఆయన పలు సూచనలిచ్చారు. పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాస్, డీఈఈ రాంబాబు పాల్గొన్నారు.

యానాం మున్సిపల్ కమిషనర్‌గా గోయల్

తొలిసారిగా పీసీఎస్ స్థాయి అధికారి నియామకం

యానాం: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా ద్విజ్ గోయల్‌ను నియమిస్తూ పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి ఇన్‌చార్జి కమిషనర్‌ను వేస్తూ ఉన్న నేపథ్యంలో యానాం మున్సిపాలిటీ చరిత్రలో తొలిసారిగా పీసీఎస్ (పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్) స్థాయి అధికారిని నియమించడం విశేషం. మున్సిపాలిటీ పురోగతికి పీసీఎస్ స్థాయి అధికారిని నియమించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అసెంబ్లీలో సూచించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో గోయల్ నియామకం జరిగింది. 21 మంది పీసీఎస్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

వడ్డీ రాయితీకి.. వారమే గడువు

- ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఆఫర్
- ఈ నెల 31వ తేదీతో ముగుస్తున్న గడువు
- గొల్లప్రోలులో గరిష్టంగా 80 శాతం వసూలు
- పిఠాపురంలో తక్కువగా 38.96 శాతం వసూలు
- మూడు జిల్లాల్లో రూ.145.43 కోట్లు బకాయిలు



అమలాపురం మునిసిపల్ కార్యాలయం

కొవ్వూరు: మునిసిపాలిటీలలో పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించింది. ఫలితంగా గడచిన పదిరోజుల నుంచి పన్ను చెల్లింపు వేగం పుంజుకుంది. వడ్డీ రాయితీ గడువు వారం రోజుల్లో ముగియనుంది. ఆస్తి(ఇంటి) పన్ను, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపుల్లో జాప్యం చేసిన వారి నుంచి అపరాధ రుసుము కింద రెండు శాతం వడ్డీతో కలిపి వసూలు చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీ లోపు పాత,కొత్త బకాయిలు కలిపి చెల్లించిన వారిపై వడ్డీ భారాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక మునిసిపాలిటీలు కొంతమేర ఆదాయం కోల్పోతున్నప్పటికీ పన్ను చెల్లింపుదారులపై ఆర్థిక భారం తగ్గించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఒక్కో మునిసిపాలిటీ సరాసరి రూ.అరకోటికి పైగా వడ్డీ రూపంలో వదులు కోవాల్సి వస్తుంది. ఈ నెల 17వ తేదీ నుంచి వడ్డీ రాయితీ జీవో అమలులోకి వచ్చింది. గత ఏడాది పన్నుల వసూలులో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిన కొవ్వూరు ఈ సారి 16వ స్థానంలో ఉంది. నెలాఖరుకు టాప్ టెన్‌లో ఉంటామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా 51.41శాతం, కాకినాడ 58.02 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 58.49శాతం వంతున పన్నులు వసూలయ్యాయి. ఈ మూడు జిల్లాల్లో ఇంకా రూ.145.43 కోట్ల మేర పన్ను బకాయి వసూలు కావాల్సి ఉంది.

ఎనిమిదో రోజుల్లో రూ.32 కోట్లు వసూలు

మునిసిపాలిటీల్లో వడ్డీ రాయితీపై అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయి. రాజమహేంద్రవరం రీజియన్‌లో 8 రోజుల్లో (శుక్రవారం సాయంత్రానికి) ఏకంగా రూ.31.94 కోట్లు వసూలైంది. ఇందులో తూర్పుగోదావరి జిల్లాలో గరిష్ఠంగా రూ.6.03కోట్లు వసూలైంది. కాకినాడ జిల్లాలో రూ.3.31కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.1.75కోట్లు రికార్డు స్థాయిలో వసూలైనట్లు అధికారులు చెబుతున్నారు.

గొల్లప్రోలు టాప్

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మునిసిపాలిటీ 80 శాతం వసూలుతో ప్రథమ స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచింది. ముమ్మిడివరం 71.71శాతం, కొవ్వూరు 71.47 శాతంతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి. పిఠాపురం మునిసిపాలిటీలో కనిష్టంగా 38.96 శాతం మాత్రమే వసూలైంది. కాకినాడ 40.42 శాతం, రామచంద్రపురం 44.12శాతంతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఈ నెలాఖరుకు వసూలును బట్టి ర్యాంకింగ్ తేలుతుంది.

కోనసీమ జిల్లాలో వివరాలు (రూ.కోట్లలో)

మునిసిపాలిటీ	డిమాండ్	వసూలు	బకాయి	వసూలు శాతం
అమలాపురం	10.94	7.05	3.89	64.44
రామచంద్రపురం	9.61	4.24	5.37	44.12
మండపేట	7.39	4.85	2.54	65.63
ముమ్మిడివరం	1.52	1.09	0.43	71.71

పన్ను వసూళ్లు పుంజుకున్నాయి



రాజమహేంద్రవరం రీజియన్‌లో పన్నుల వసూళ్లు పుంజుకున్నాయి. వడ్డీ రాయితీ కల్పించడంతో భాగానే స్పందిస్తున్నారు. రాయితీపై విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. వార్డు సచివాలయాలు, మునిసిపల్ కార్యాలయంలో, పురసేవా యాప్, సీడీఎంఏ.ఏపీ.జీవోవిటీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారాగానీ పన్నులు చెల్లించవచ్చు.

– ఎస్‌వీవీ సత్యనారాయణరావు, మునిసిపల్ రీజనల్ డైరెక్టర్,రాజమహేంద్రవరం

క్లుప్తంగా

వరద బాధితుల్ని రక్షించడంపై శిక్షణ



మునిగిపోతున్న వారిని ఎలా రక్షించాలో చూపిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

సామర్లకోట: వరదల్లో చిక్కుకున్న వారిని ఏ విధంగా రక్షించాల్లో ఆపద మిత్రలకు ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది కళ్లకు కట్టినట్లు చూపించారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన 80 మంది ఆపద మిత్రలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా శనివారం మండల పరిధిలోని అచ్చంపేట పంచాయతీ చెరువు వద్ద ఫీల్డ్ విజిట్ విపత్తుల నివారణ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి ఆధ్వర్యంలో చెరువులో మునిగిపోతున్నవారిని బోటు, తాళ్ల సహాయంతో ఏవిధంగా రక్షించాలో లైవ్ డెమో చూపించారు. నీటిలో మునిగిన వ్యక్తుల్ని బయటకు తీశాక ప్రథమ చికిత్స ఎలా చేయాలో నేర్పించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ తుపాన్లు, వరదలొచ్చినపుడు మత్స్యశాఖ సహకారం ఎక్కువగా అవసరమవుతుంది కనుక సంబంధిత అధికారులకు ఆపద మిత్రలు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్డీఆర్ఎఫ్ ప్రతినిధి హరిచంద్ కుమార్, ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది డి.శివకుమార్, జి.దినేష్, ఎం.శ్రీనివాసరావు, ఈవీ రమణ, కేఎస్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం రిజిస్ట్రేషన్లు చేస్తాం

రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ నాగలక్ష్మి

కాకినాడ లీగల్: ఉమ్మడి జిల్లాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఈ నెల 26వ తేదీ (ఆదివారం) పనిచేయాలని రాష్ట్ర ఐజీ వద్ద ఉత్తర్వులు పంపారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్(డీఐజీ) ఎ.నాగలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఆదివారం సెలవు అయినప్పటికీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయాలు పని చేస్తాయన్నారు. ఆ రోజు రిజిస్ట్రేషన్ చేయించుకునే వారి కోసం భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్బీఐ) బ్రాంచీలు కొన్ని జిల్లాలో పనిచేస్తున్నాయని, వారు చలానా బ్యాంక్ ద్వారాగాని, ఆన్‌లైన్ లోగాని చెల్లించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలిని డీఐజీ కోరారు.

ఆరుదెంచిన మార్పు

- ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షల్లో సంస్కరణలు
- 11 నుంచి ఆరు పేపర్లకు కుదింపు
- ప్రతి సబ్జెక్టుకు 100 వంతున మార్కులు

రాయవరం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మ ఒడి, ఒకటో తరగతి నుంచే ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ, పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలల ఏర్పాటు ఇలా పలు నూతన సంస్కరణలకు నాంది పలికారు. తాజాగా పది పబ్లిక్ పరీక్షల్లో చేపట్టిన సంస్కరణలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు కానున్నాయి. సీబీఎస్ఈ తరహాలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహించే క్రమంలో భాగంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుని పబ్లిక్ పరీక్షలు ఏ విధానంలో నిర్వహిస్తారనే గందరగోళానికి ఫుల్‌స్టాప్ పెట్టడం ప్రభుత్వం ముందుచూపునకు, చిత్తశుద్ధికి నిదర్శనంగా చెప్పవచ్చు.

గతంలో ఇలా..

పదవ తరగతిలో కొన్నేళ్లుగా 11 పేపర్లను నిర్వహించారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు నిర్వహించేవారు. సైన్సులో ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షను ఒక్కో రోజు వంతున 11 రోజుల పాటు పరీక్షలు నిర్వహించేవారు. కరోనా ప్రభావంతో 2019–20, 2020–21 విద్యా సంవత్సరాల్లో పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021–22 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా, 11 పేపర్లను ఏడు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపరుకు 100 మార్కులకు వంతున పరీక్ష నిర్వహించగా, ఫిజికల్ సైన్స్, బయాలజీ పేపర్లను ఒక్కో పేపరును 50 మార్కుల వంతున నిర్వహించారు.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..

2022–23 విద్యా సంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులకు పేపరు నిర్వహిస్తున్నారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒకే ప్రశ్నాపత్రం ఇస్తారు. అయితే జవాబులు మాత్రం వేర్వేరు సమాధాన పత్రాల బుక్‌లెట్స్‌లో రాయాల్సి ఉంటుంది. పీఎస్, బయాలజీ జవాబు పత్రాలను సంబంధిత ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయడానికి వీలుగా ఇలా వేర్వేరు జవాబు పత్రాల్లో రాయిస్తారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొడుతుందని విద్యావేత్తలు భావిస్తున్నారు.

గ్రేడ్ పాయింట్ల తొలగింపు

గ్రేడ్ పాయింట్ల విధానంలో జరుగుతున్న అనర్థాలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. గ్రేడ్ పాయింట్ల వల్ల విద్యార్థులకు ఉన్నత చదువుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న విమర్శలున్నాయి. ఇటీవల ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో చేరేందుకు గ్రేడ్ల ఆధారంగా సీట్లు కేటాయించడానికి అధికారులు అవస్థలు ఎదుర్కొన్నారు. గతంలో ఉన్న పరీక్షా సమయాన్ని కూడా ప్రభుత్వం మార్పు చేసింది. గతంలో ఈ సమయం మూడు గంటలు ఉండగా, ఇప్పుడు 15 నిమిషాలు పెంచారు. ఈ 15 నిమిషాల వ్యవధిలో ప్రశ్నపత్రం చదవడానికి, రాసిన సమాధానాలు సరిచూసుకోవడానికి వీలవుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 70,085 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కానున్నారు.



ఆ విధానానికి సన్నద్ధం చేశాం



పది పబ్లిక్ పరీక్షల్లో ఆరు పరీక్షలు ఉండడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రస్తుతం నిర్వహించే 100 మార్కుల పేపరు మోడల్‌కు అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేశాం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించాం.

– మోకా ప్రకాష్, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, తొండవరం, అంబాజీపేట మండలం

అంచనా వేసేందుకు వీలు



పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లలో నిర్వహించడం ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయం. 100 మార్కులకు ఒకటే పేపరు నిర్వహించడం వలన విద్యార్థుల్లో భయాందోళనలు తగ్గుతాయి. విద్యార్థుల అకడమిక్ స్థాయిని కచ్చితంగా అంచనా వేయడానికి వీలుంటుంది.

– కేవీ రమణారావు, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, పాతతుంగపాడు, రాజానగరం మండలం

ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు



విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం చర్యలు తీసుకుంది. 2024–25లో సీబీఎస్ఈ విధానంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సన్నద్ధం చేసే చర్యల్లో భాగంగానే ఈ విద్యా సంవత్సరం నుంచి పది పరీక్షల్లో ఆరు పేపర్లను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

జగన్ సీఎం కావడం ప్రజల అదృష్టం

ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్

తుని రూరల్: పేద ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేసే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల అదృష్టమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. శుక్రవారం తునిలో మంత్రి దాడిశెట్టి రాజా జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య, రక్త, అవయవ దాన శిబిరాలలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగినా చంద్రబాబు నాయుడికి, నారా లోకేష్‌కు అనుకూలంగా మీడియా విస్తృత ప్రచారం చేస్తోందన్నారు. అటువంటి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు వైఎస్సార్ సీపీ సైనికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతానికి యువత నిరంతరం కృషి చేయాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు యువజన విభాగం సమష్టిగా ఐక్యతతో పని చేయాలన్నారు. ప్రభుత్వం అములు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. యువతను చైతన్యం చేసేందుకు ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటిస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు రాజానగరం నుంచి తుని చేరుకున్న జక్కంపూడి గణేష్‌కు యువజన విభాగం నాయకుడు దాడిశెట్టి శ్రీనివాస్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్ నుంచి సాయివేదిక వరకు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వక్ఫ్‌బోర్డు జిల్లా వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న జక్కంపూడి గణేష్, దాడిశెట్టి శ్రీనివాస్

సీఆర్‌సీ ప్రోత్సాహం ఎనలేనిది

- సినీనటుడు తనికెళ్ల భరణి
- చివరి రోజు ఆకట్టుకున్న నాటికలు

రావులపాలెం: భారతీయ సంస్కృతులను, సంప్రదాయాలను నేటి తరానికి అందించాలనే సంకల్పంతో కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) ఆధ్వర్యంలో నాటక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేదని పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీనటుడు తనికెళ్ల భరణి అన్నారు. సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 23వ ఉగాది జాతీయ తెలుగు నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. చివరి రోజు శుక్రవారం నాటికలను వీక్షించేందుకు సినీనటులు శుభలేక సుధాకర్, కృష్ణ భగవాన్, కోట శంకరరావు, గౌతంరాజు, నైనా, కృష్ణ చైతన్య, తదితరులు హాజరయ్యారు. మూడో రోజు విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారి ''అతడు అడవిని జయించాడు'' నాటిక, విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి ''నిశ్శబ్దమా నీ ఖరీదెంత'' నాటిక, సీఆర్‌సీ ప్రత్యేక ప్రదర్శన, అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరిగాయి. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ వెలగల సతీష్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్ గోపాలకృష్ణ, కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి పర్యవేక్షించారు.

అతడు అడవిని జయించాడు

నమ్ముకున్న వారిని రక్షించడం నాయకుడి లక్షణం, బాధ్యత. నేటి రాజకీయ వ్యవస్థలో ఆ లక్షణం పూర్తిగా మృగ్యమైపోయింది. కానీ మృగాలతో నిండి ఉన్న అరణ్యంలో సంచరించిన తన పెంపుడు పందిని కాపాడుకున్న ఒక ముసలివాడి పోరాటం ఈ రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుంది. నాయకత్వం అంటే ఏంటి, తనని నమ్ముకున్న వాళ్లని రక్షించడం అంటే ఏంటో, చదువు జ్ఞానం లేని ప్రపంచం తెలియని ఆ ముసలివాడు చూపిస్తాడు. అదే అతడు అడవిని జయించాడు నాటిక. మంచి సందేశాత్మకంగా ప్రదర్శించారు.

నిశ్శబ్దమా నీ ఖరీదెంత?

వివాహేతర సంబంధం నేరం కాదని చట్ట ప్రకారం ఎవరిని శిక్షించేది లేదని ఉన్నత న్యాయస్థానం ఐపీసీ నుంచి 497 సెక్షన్‌ను తొలగించింది. దీంతో కళ్ల ముందు భార్యాభర్త ఎవరినైనా సరే మరొకరితో సంబంధం ఏర్పరచుకుంటే శిక్షించలేని నిస్సహాయత ఏర్పడింది. కావాలంటే ఈ కారణంగా విడాకులు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించింది. మరి నైతిక విలువల మాటేంటి?, వివాహ వ్యవస్థ పవిత్రత మాటేంటి?, మరి ఈ వివాహేతర సంబంధాల సంఘర్షణలో నలిగిపోతున్న పిల్లల భవిష్యత్తు ఏంటి? అనే అంశాలను నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలో వివరించారు.



అతడు అడవిని జయించాడు నాటికలో సన్నివేశం



అతడు అడవిని జయించాడు నాటికకు పారితోషికం అందిస్తున్న సినీనటుడు తనికెళ్ల భరణి తదితరులు

సెపక్ తక్రాలో కాంస్య పతకం

అమలాపురం రూరల్: కర్నూల్ జిల్లా నందికొట్కూరులో జరిగిన 33వ రాష్ట్రస్థాయి సీనియర్ సెపక్ తక్రా మెన్ అండ్ ఉమెన్ చాంపియన్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు కాంస్య పతకం సాధించారు. పతకం సాధించిన జట్టును, కోచ్ యండ్రా గౌతమ్‌ను జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ సభ్యుడు మునగల మణ్యం, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వాసంశెట్టి సుభాష్, వైఎస్సార్ సీపీ నాయకుల ముట్టపర్తి మురళీకృష్ణ చెల్లుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్ దొమ్మేటి రాము, ఆర్‌కే రమేష్, జీవీ బాబులు క్రీడాకారులను అభినందించారు.



పతకం సాధించిన క్రీడాకారులు

పరీక్ష రాశారు.. ప్రతిభ చూపారు

ఎన్ఎంఎంఎస్ ఫలితాలు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

రాయవరం: ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఏడాది కూడా ఉపకార వేతనాలకు అర్హత పొందేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 465 మంది విద్యార్థులు ప్రాథమికంగా అర్హత సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించగా, 9,124 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు(తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు) ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. అర్హత పొందిన వారికి నెలకు రూ.1,000 వంతున ఏడాదికి రూ.12వేలు ఉపకార వేతనం ఇస్తారు.

జిల్లాల వారీగా పరీక్ష రాసిన విద్యార్థులు, అర్హత పొందిన వారు

జిల్లా	పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు	అర్హత పొందిన వారు
కోనసీమ	15	3,018	143
కాకినాడ	15	3,667	174
తూర్పుగోదావరి	11	2,439	148
మొత్తం	41	9,498	465

అటెన్షన్

- పది పరీక్షలకు కౌంట్‌డౌన్ ప్రారంభం
- స్టోరేజ్ పాయింట్లకు తొలి విడత ప్రశ్నాపత్రాలు

రాయవరం: మరో తొమ్మిది రోజుల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో పాటు విద్యాశాఖాధికారులకు కూడా టెన్షన్ మొదలైంది. మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారులు పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.



కాకినాడ నుంచి స్టోరేజ్ పాయింట్లకు పేపర్ల పంపిణీని పరిశీలిస్తున్న డీఈవో అన్నపూర్ణ, ఏసీ రాజశేఖర్, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు

373 పరీక్షా కేంద్రాలు..: వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలు రాసే విద్యార్థులకు 373 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పోలీస్ స్టేషన్‌కు దగ్గర్లో 257 పరీక్షా కేంద్రాలు ('బి' సెంటర్లు) ఉన్నాయి. పోలీస్ స్టేషన్‌కు ఎనిమిది కిలోమీటర్ల పైబడి 116 పరీక్షా కేంద్రాలు ('సి' సెంటర్లు') ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 77,085 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 373 పరీక్షా కేంద్రాలకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఏడీవోల నియామకాలు చేపట్టి, ఒక రోజు శిక్షణ కూడా ఇచ్చారు.

పటిష్టమైన బందోబస్తుతో...

కాకినాడ నుంచి 24 స్టోరేజ్ పాయింట్లకు శుక్రవారం సెట్–1, సెట్–2 పరీక్ష పేపర్ల తరలింపు ప్రక్రియ చేపట్టారు. కోనసీమ జిల్లాలో 24 స్టోరేజ్ పాయింట్లకు సెట్–1 పేపర్లు చేరుకోగా, స్టోరేజ్ పాయింట్లలో భద్రపరుస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని 22 స్టోరేజ్ పాయింట్లకు సెట్–1 పేపర్లు చేరుకున్నాయి. సెట్–2 పేపర్లు శనివారం జిల్లా కేంద్రానికి చేరుకోనున్నాయని, వాటిని పటిష్టమైన బందోబస్తుతో స్టోరేజ్ పాయింట్లకు తరలిస్తున్నట్లు జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో గాయాలై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగీతం కామేశ్వరరావు (69) శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఈ నెల 23న సీతంపేటలో సైకిల్‌పై వెళుతున్న కామేశ్వరరావును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. మృతుడి కుమారుడు సంగీతం చిన వెంకటరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని అన్నారు. మృతుడి కామేశ్వరరావు సీతంపేట గ్రామానికి చెందినవాడన్నారు.

క్రైం కార్నర్..

యువకుడి ఆత్మహత్య

తాళ్లరేవు: మండల పరిధిలోని నీలపల్లి గ్రామంలో మల్లాడి బాబి(18) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌కు చెందిన బాబి తండ్రి మృతి చెందడంతో వేటకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే డ్రగ్స్, మద్యానికి అలవాటు పడిన బాబి 10 రోజులుగా అధికంగా మద్యం సేవిస్తుండడంతో తల్లి మందలించింది. ఈ నేపథ్యంలో తల్లి బయటకు వెళ్లిన సమయంలో ఇంటి దూలానికి ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసకుమార్ తెలిపారు.

ఇరు వర్గాల గొడవల్లో ఏడుగురిపై కేసు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి నెల్లివారిపేటలోని రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. శుక్రవారం ఈ కేసులో ఇరువర్గాల్లోని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ రైతు కొబ్బరితోటలో కొబ్బరికాయలు తీసుకునే విషయంలో తొత్తరమూడి నెల్లివారిపేటకు చెందిన నెల్లి మంగాదేవి, నేదునూరి బుజ్జిబాబుల మధ్య గొడవ జరిగింది. వీరు ఇచ్చిన ఫిర్యాదులపై మంగాదేవి భర్త సత్యనారాయణ, ఆమె కుమార్తె, అల్లుడి పైన, బుజ్జిబాబు, మార్తమ్మ, రామలక్ష్మిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.